# పులి కూన

రాయసం వేంకటశివుడు గారు, యం. ఏ.

మొదటి నీలాద్రిని గురించి పత్త్రికాముఖమున తీవ్రమగు చర్య జరుగుచుండెను. ప్రాచీనాంధ్రదేశ పరిస్థితులు గ్రహింపఁ బరిశ్రమము చేయు పండితవర్యులు నీలాద్రి కాలవిషయమై భిన్నాభిప్రాయము గలవారైరి. కొంద ఱీయన వెలమనాయకులలో నొకరని తలంచిరి. మఱికొందఱు బ్రాహ్మణుఁడనియు, కాకున్న క్షత్రియుఁ డేని యగుననియు వాకొనిరి. వేఁగిదేశము నేలినవాఁడని యొకపక్షము వారు చేసిన సిద్ధాంతమును, కళింగదేశపు ప్రభువని ప్రతిపక్షులు పూర్వపక్షము చేసిరి. ఇది యిటులుండఁగా, గోరుచుట్టుమీఁద రోఁకటిపోటు మనట్టు, భట్టుగారు తాము నూతనముగఁ గనిపెట్టినయొక తామ్రశాసనము మీఁది లిపిని బ్రచురించి, దానికి విపులమగు వ్యాఖ్య వ్రాసిరి. నీలాద్రి యను ప్రభువు ఉండినయెడల, అతఁడు పులినకూనయను పర్యాయ నామము దాల్చియుండవలయునని భట్టుగారి సిద్ధాంతము. భట్టుగారు పక్షపాతబుద్ధి గలవారనియును, నిరతము తమవైదికుల యుత్కర్షనే ప్రధానముగఁ జూచుకొను వీరికన్నులకు, లౌకికులగు తమబోంట్ల సిద్ధాంతములు రుచింపకున్నను, తాము సత్యము వక్కాణింప సాహసించుచున్నారనియు పంతులుగారు చెప్పుచు, పెద్దవ్యాసమును వ్యాఘ్రేశ్వరీ పత్రికలో వ్రాసి, "వైదికశిఖామణుల విశ్వామిత్ర సృష్టియనదగు నిట్టి పులికూనలు పిల్లికూనలకంటె నపుంసకులై వేగమే కనుమఱుఁగఁగలవు!" అని తమవ్యాసమును ముగించిరి. పూర్వులయౌన్నత్యము నపహసించెడి రావుగారలొకోకాని, "పులికూనవిషయమై ప్రచురమైన యీనూతన శాసనము పండితులకు మిగుల సహాయకారిగాఁ గల"దని విశ్వసించిరి.

ఈశాసనము లిఖింపఁబడిన గ్రామముపేరు "కోనపలి" యని యున్నది. ఈకోనపలి, కొనబలి, గొంబలి, కలపర్రు అనుపేర్వేరు పేరులుగల గ్రామములు కావచ్చునని యొవరికిఁ దోఁచినట్టు వారు తలంచిరి. తామ్రశాసనమునందలి 'వ' 'టి'ని బోలియుండుటచేతను, 'ప' 'ఫ' లకంతగ భేదము శిల్పకారులు చూపకుండుటచేతను ఆగ్రామము గోదావరిమండలమందలి పుణ్యక్షేత్రమగు "కోటిఫలి" కావచ్చునని శర్మగారు వాదించి పుణ్యమును గట్టుకొనిరి. దీని కెంతయుఁ గోపించి రెడ్డిగారు "ఈప్రాంతశాసనములందైనను ఉత్తరాదివారు తమదాక్షిణాత్యమిత్రుల యౌన్నత్య మంగీకరింపవలసి వచ్చునేమోయని వెఱచి, వానినెల్లఁ దమపుణ్యక్షేత్రములకుఁ గొనిపోవుచున్నట్టుగఁ దోఁచుచున్నది! లేకున్న శాసనమునందలి కోనపలి (కోనవలి, కోవలి, కావలి) కావలి కావలయుననుట స్పష్టముగదా!" యని వ్యక్తీకరించిరి. ఇట్లు త్రాడును బొంగరమును లేకయే, నేనీకోనపలిస్థలనిర్దేశముఁ జేయ బయలువెడలితిని.

ఆంధ్రదేశమందలి యనేకప్రదేశములలోని ప్రాంతగుడులు చూచి, శిథిలతాళపత్త్రములు, గ్రంథములు తిరుగవేసితిని. పూర్వపు నాణెము లందలి నామక్కువయెఱిఁగి యొకచోట నొకగృహస్థుఁడు నాకు రాగి నాణెము నొకటి చూపించెను. దానిమీఁద కోనపలి తామ్రశాసనమునందు వలెనే యఱిగిపోవు చిత్రముగలదు. ఒకపిల్లవాఁడు పెద్దపులిపాలు గ్రోలుచు, ఒకచేతిని పులిమెడలమీఁదికిని, రెండవచేతిని చెంతనిలుచుండిన యొకస్త్రీవైపునకును జాచియుండెను. ఈనాణెము దొరకినగ్రామమునకుఁ బోయి నేను విచారింపఁగా, కోనపలినిబోలిన పేరుగలగ్రామ మాప్రాంతములందెచటను లేనట్టు తెలిసినది. కాని, యాసమీపగ్రామములందు "పులికూన" వారివృత్తాంతముగల దండకవిలెలున్నట్టు నాకుఁ దెలిసినది. పేదస్థానికి పెన్నిధిదొరకినవిధమున నేనావండకవిలెలను సంపాదించి చూచితిని. వానియందలి కథ నాకెంతో యాశ్చర్యము గలిగించెను. చదువరుల యుపయోగార్థ మది యిచట సంగ్రహముగఁ దెలుపుచున్నాను.

## సన్న్యాసి వాక్యములు

రాత్రి రెండుయామము లగుటచేత గ్రామమంతయు సుషుప్త్యవస్థ యందు మునిఁగి యుండెను. ఎల్లెడలను నిశ్శబ్దముగ నుండెను. ఏలొకో కాని కంటికి కూరుకురాని సింహాద్రి, ఇంటి గవాక్షమునొద్దనుండి చూచుచుండెను. చీమచిటుక్కుమనినా, ఆయన వీనుల కది గోచరింపవలసినదే. అపుడు దూరమున వాకిటగుఁగునుండి మెల్లనిధ్వని యాయనకు వినఁబడెను. అందు సంస్కృతశ్లోకచరణము లున్నటులు గ్రహించి యతఁడు మఱింతశ్రద్ధగా నాకర్ణింపఁగా

"అస్థిరం జీవనం లోకే
అస్థిరం యౌవనం ధనమ్,
అస్థిరం దార పుత్రాది
ధర్మకీర్తి ద్వయం స్థిరమ్."

అనుశ్లోక మాయన వీనులకు వినఁబడెను

రాత్రి రెండవజామువేళ నీయమంగళవచనము లెవ్వరినోటనుండి వచ్చుచున్నవాయని సింహాద్రి యాశ్చర్యపడెను. నాఁడు తనతనయుని

జన్మదినము.సకలవైభవములతో నాదివసమున నింట నుత్సవముజరిగెను. పేదసాదలచట మృష్టాన్నము భుజించిరి.ఎల్లెడలను ఆయనచిన్నితనయుని దీవనలు మంగళవచనములు నే వినఁబడెను. అట్టిచో, తన యభ్యుదయమున కసూయపడుచున్న దురాత్ముఁ డెవఁడో యిట్టియశుభసూచకములగు వాక్యములు స్మరించుచున్నాఁడని సింహాద్రి కోపించి, వానినిఁ జేరఁజని "ఈసంతోషసమయమున నిట్లు తలపోయ నీకుఁగతమేమి?" యనియడిగెను. తానొకసన్న్యాసిననియు, దుఃఖభాజనమగు నీలోకమున జ్ఞాని కంటి క్లేశల నిరసింపవలసినవిషయములే కానవచ్చుననియు నతఁడు చెప్పెను. దీనికిఁ గటకటఁబడి, యిట్టి కఠినుఁడు తనవాకిట శయనింపఁ గూడదని తలంచి సింహాద్రి యతనిని వెనువెంటనే వెడలఁగొట్టించెను.

## సింహాద్రి దురవస్థ

మఱునాఁడు తెల్లవాఱకమునుపే సింహాద్రిభార్య పండుకొనినది పండుకొనినట్టుగనే మంచముమీఁద మరణించిపడియుండెను! ఎదురుచూడని యాపత్తువలన జనించిన దుఃఖపారవశ్యమున సింహాద్రి మతిచలించెను. జడదారి యాగ్రహమువలనఁ దమవారి కీదురవస్థవచ్చెనని తలపోసి, బంధువు లాతనికొఱకై వెదకిరిగాని, వాని జాడలెందును గానరావయ్యెను. సకలైశ్వర్యములలోఁ దులతూఁగు సింహాద్రిగృహము చూచుచుండఁగనే సర్వానర్థములకును బుట్టినిల్లయ్యెను! కష్టముమీఁదనే కష్టమువచ్చెను. తల్లియెడబాటున కోర్చుకొనఁజాలక బాలకుఁడు విరామములేక యేడువసాగెను. అపారశోకాబ్ధిలో మునింగిన యాయర్భకుఁడు, ఆకలిదప్పికలను మఱచి, తల్లినే యెప్పుడును స్మరించుచు, రాత్రింబవళ్లు రోదనముచేయుచుండెను. తండ్రియవస్థను వగచుచు, వాని పరిచర్యలయందే నిమగ్నులగుబంధువులు, పిల్లవానిరోదనము రోగివీనులకుఁ దగిలెనా చికిత్సకుఁ బ్రతిబంధకమగునని యూహించి, బాలునిఁ బెరటిసాలలోఁ బండుకొనఁబెట్టిరి. ఇట్లు తండ్రియుఁ దనయుఁడును జెప్పనలవిగాని దుస్థితియందుండఁగా నొకనాఁటిరాత్రి అడవినుండి వెడలివచ్చిన పులియొకటి దొడ్డిగోడ దుమికి, హాహాకారముచేయుబాలుని నోటఁ గఱచుకొని, యడవులకుఁ బలాయనమైపోయెను!.

బంధువుల యుపచారములవలనఁ గొంతకాలమునకు మనస్స్వాస్థ్యత గాంచిన సింహాద్రి, తనయునిఁ గానమిచే మఱల స్థైర్యమును గోలుపోయెను. సతీవియోగమునకంటె సుతునిగోల్పోవుటయే యతనికధిక దుఃఖహేతువయ్యెను. కాని యీమాఱు దుఃఖప్రకోపముచేత నతనికిఁ గలిగిన యున్మాదము మతిని భ్రమింపఁజేయునదిగాక, దాని కేకాకారవృత్తిని గల్పించుచుండెను! స్మృతిలేకయు, జడత్వమూనియు నతఁడిపు డుండఁడు. అతనిబుద్ధి మఱింత తీక్ష్ణతదాల్చియుండెను. రేయుంబవళ్లు వానిమనస్సు ప్రత్తిరాటమువలె గిఱ్ఱునఁ దిరుగుచునేయుండును! జాగ్రత్స్వప్నాద్యవస్థలుగాని, లోకమునందలివిషయసముదాయముగాని, వాని హృదయావేగము నరికట్టలేకుండెను. ఊహలును, ఆలోచనలును నిరంతరప్రభుత్వము సల్పుచుండఁగా, బానిసవలెనొదిఁగి సింహాద్రి మనస్సును కాలుసేతులు గట్టినట్టుగ నణఁగి, వానిశరీరము, చేవదక్కి యతిదీనదశ యందుండెను!.

ఇపు డహర్నిశము సింహాద్రిమనస్సును గలవరపెట్టు నాలోచనలన్నియు సుతుని సేమమునుగుఱించినవియే. ఇతరులందఱును పులినోటఁబడినవానిపుత్రుని గుఱించి నీళ్లువిడిచినను, సింహాద్రి మనోవీథినిమాత్ర మాయర్భకుని యాకారము విస్పష్టముగఁ గానిపించుచునేయుండును! ప్రయత్నము చేసినఁ దప్పక తనతనయుఁడు దక్కునని యాతనివెఱ్ఱిభ్రమ! పుత్త్రకుఁ డేదోవిధమున పులినోటినుండి తప్పించుకొని సజీవుఁడైయుండెనని వాని వెఱ్ఱినమ్మకము! ఎంతటి వెఱ్ఱివైనను, ఈభ్రమవిశ్వాసములే వానిహృదయమున ప్రేమాగ్నిని నిరతము రగుల్కొలిపి, అర్భకునిఁ జూచెదమను నెపమున వానికి ప్రాణమునందలి తీపివాయకుండఁజేసెను!

కాని, యూహ లెంత తీక్ష్ణముగనున్నను, సింహాద్రి వానిని గ్రియారూపమునకుఁ దేనేరకుండెను. ఎప్పుడును మంచము నే యంటిపట్టుకొని యుండుటచేత వానిశరీరము శుష్కించి పాగిపోయెను. తైలరహితమగు జ్యోతివలె, కార్యరూపమొందని సంకల్పమును నంతరింపవలసినదే. ఇన్నాళ్లును గాఢముగకోరిక నాశ్రయించియుండు నాతనిప్రాణము, ఇంక మనోరథసాఫల్యమున కవకాశములేదని గ్రహించెనా యనునట్టుగ మినుకుమినుకుమనఁ జొచ్చెను. ఇట్టియవస్థయందున వానినోడ్డుచేర్చుటకే తెంచిన దివ్యనౌకవలె నొకటి సన్న్యాసి వానికంటఁబడెను. ఆయన కారాత్రి దానుజేసిన పరాభవమునకు సింహాద్రి వగచి తన్ను మన్నింపుమని వేడఁగా, తాపసి వానియెడల ప్రసన్నుఁడై, వానికిఁ జిరకాలములో నారోగ్యము నొడఁగూర్పఁగల యొకమూలిక నిచ్చి, సింహాద్రికొమరుఁడు జీవించియుండెననియు, తగుప్రయత్నము చేసినచో దొరకుననియుఁ జెప్పి, తనదారిని దానుబోయెను.

వాడిపోవుమొలకలు తొలకరి వానకుఁ బచ్చవాఱు తెఱఁగున, కాటికి కాలుసాచిన సింహాద్రి కుమారుని సేమము విని, మెల్లమెల్లగ మేదిని నడుగులు పెట్టసాగెను. ఔషధసేవకంటె సన్న్యాసి గలిగించిన యాసయే సింహాద్రిస్వస్థతకుఁ గారణమయ్యెను. కొంతకాలమునకుఁ బరిపూర్ణారోగ్యమును గాంచి సింహాద్రి, కుమారుని వెదకుట కుద్యమించెను. వారి గ్రామమునకుఁ బశ్చిమముగఁ జాలదూరమున నొక పర్వతపంక్తిగలదు. దానిచుట్టును కాంతులు దూరని కారడవియుండెను. ఇది వ్యాఘ్రాదుల కునికిపట్టు. చాలకాలముక్రిందట పులినోటఁబడిన బాలుని వెదకుట కడవికిఁ దనకుఁ దోడురమ్మనియడిగిన సింహాద్రినిఁజూచి పరిహసించువారేకాని, వానికి సాయముచేయుట కిష్టపడువా రా గ్రామమునఁ గానరైరి. కావున, కొంతసత్తువ గలుగఁగనే, సింహాద్రి యొకనాఁ డింటఁజెప్పక, యడవులకుఁ బయనమయ్యెను.

## పులి - పులికూనలు

తనయునిఁ గనుగొనవలయు ననునాసచే నామానిసి యెన్నికడగండ్లకైన నోర్చి, కారడవులఁ బడిపోయెను. అన్నపానములు వర్జించి

యతఁ డరణ్యఫలము లాహారముగను, సెలయేళ్లజలములు పానీయముగను గైకొని, రేయుంబవళ్లు వనమున దిరుగుచుండెను. ఒకనాఁటిప్రాతఃకాల మొకచెట్టుచాటునుండి చూచుచుండఁగా, దూరమున నతని కన్నులకొక చిత్రమగు దృశ్యము గానవచ్చెను. ఒకపొదనుండి లేఁడి కళేబరమును నోటఁబెట్టుకొని వెడలి, పులి చెంగుచెంగున దాఁటిపోవుచుండెను. దానిని వెన్నాడు చిన్న జంతువొకటి వేగముగ పరుగులిడుచుండెను. అది తల్లిని గోలుపోయిన లేఁడికొదమ యగునాయని సింహాద్రి మొదట తలంచెను. తల్లిని గబళించుపులి, పిల్లను ముద్దుపెట్టుకొనునా? వెంటవచ్చెడి యీ చిన్నిజంతువు తన్నుగలసికొనుటకై పులి యచ్చటచ్చట నిలుచుండుట వలన నది పులిపిల్లయనియే సింహాద్రి నిర్ధారించెను. కాని, పులిపిల్లయే యైనచో నది చిత్రమగు పులిపిల్ల కావలయును! రాలుగ్రుచ్చుకొనియును, అలసటఁజెందియును, అప్పుడప్పుడవి ముందుకాళ్లెత్తి మనుష్యుఁడునడచునట్టె నడచుచుండెను! "ఇంతవింత ఎచటనైనఁగలదా? ఏకాలమందైనను, ఏకల్పనాకథలోఁగాని, పులి మనుష్యునివలె నడచుననియున్నదా ఈపులిపిల్లకు తోఁకకూడలేదే! ఇదియొకమానిసిపిల్లవాఁడుకాఁడుగదా!" యనిసింహాద్రి సందియమందెను. ఈయూహ వానిమనస్సునకుఁదట్టఁగనే, చెప్పనలవిగాని యుద్రేకముగలిగి వానికిచెవులు గడులుపడెను. కన్నుల మాంద్యము గ్రమ్మెను. కాని యిదియొకక్షణకాలముమాత్రమె. పులి వెంటఁ బరుగిడుబాలుఁడు తానింతశ్రమతో వెదకుచుండెడి తనతనయుఁడేయని సింహాద్రి నిశ్చయించెను. వ్యాఘ్రముకడ కేగనున్న బాలకునిఁబట్టుట కుపాయ మేమాయని యతఁడు బాగుగ నాలోచింపనైన నాలోచింపఁడు. ఆసమయమున నేయూహయు నేయుపాయమును వానికిఁ దోఁపకుండెను. స్వప్రాణసంరక్షణ మనుమాటయె వానికి స్ఫురింపకుండెను. తనముద్దులపట్టినిబట్టుకొని వానిని గేహమునఁజేర్చుట యొకటిమాత్రమె లోకములోఁ దాను సాధింపవలసిన కార్యముగఁ దోఁచెను. ఆకార్య మిపుడె, యీనిముసముననే, నెఱవేర్పవలయును. క్షణకాల మాలస్యమయ్యెనా పిల్లవానిని పులి తిరిగి కారడవులలోనికిఁ గొనిపోవును. మిన్నువిఱిగి మీఁదఁబడినను, పుడమి పాతాళమునఁ బడిపోయినను, సింహాద్రి తోడ్తోడ నీకార్య మాచరింపవలసినదే!.

ఈసంగతి చెప్పుట కింతకాలము పట్టినదిగాని, జరుగుటకుఁ గాదు. కనుగీటు నంతటిలో, జింకకొదమవలని కుఱుకు సింగమువలె, సింహాద్రి నందనుని వెంబడించెను. తఱుముకొనివచ్చు నీనరరాక్షసునివలనఁ దన్ను రక్షింపుమని బాలకుఁడు వ్యాఘ్రముమాతకు మొఱలిడెను. వానియఱపు పులిపిల్ల యఱపువలె నుండెను! ఇది విని వ్యాఘ్రము, తనకూనవైపునకు దాట్లువైచి పరుగెత్తిరాసాగెను.

ఇంతలో సింహాద్రి బాలకునిఁ గలసికొని, "నాయనా! నీలా" అని పలుమాఱు వానిని పేరుతోఁ బిలిచి, వానిమొగముదువ్వి ముద్దాడి కన్నీటితో వానియంగకములఁ దడిపెను. పిన్నవాఁడు మానవజన్మమెత్తినను, చిరకాల సహవాసమున పులినేదటియాఁగోరుచు, ఆమనుజుని ముఖసందర్శనము చేయుటకు బెదరుచుండును. బాలకుని వదనము నరముఖమునకుండు నున్నదనముతగ్గి, వెండ్రుకలతో నొప్పియుండెను. వానిచెవులను, బుజములను వన్యమృగములమెడనుండు జూలునుబోలిన రోమములు దట్టముగఁ గప్పియుండెను. తండ్రి తనచేయిస్పృశించునపుడును, దేహము నిమురునపుడును, మందహాసముచేయుటకు మాఱుగా బాలకుఁ డడవిమృగమువలె కీచుమని యఱచి, నిడుపగు తనకోరపండ్లతో జనకుని గఱచుటకును, కాలుసేతులవాడిగోళ్లతో వాని రక్కుటకును, సిద్ధమగుచుండును.

కాని, యీవికృతాకారమును, వికారపుచేష్టలును తనయుని గుఱుతుపట్టుటకు తండ్రి కేమియు నాతంకములు గాకుండెను. పేరుపెట్టి పిలిచినపుడు, పూర్వపుసంగతు లేవియో మననముచేసికొనుచున్నట్లుగానఁ బడి, నీలాద్రి జనకునివైపు తేఱిచూచును. కాని, యొక్కింతసేపటిలో నరప్రకృతితగ్గి, మృగచేష్టలును, మృగప్రకృతియుఁ బైకొనఁగా, తనతల్లివైపునకుఁ బరుగెత్తి కాలుసేతులు సాచును. తిరిగి తనపేరువినునపుడును, జనకుని యాకారము చూచునపుడును, బాలకునికి నరలోకపు స్మృతి జనించుచుండును. ఉయ్యాలవలెనూగుచు నాబాలకునిమనస్సు, కొంతసేపటికి మెల్లమెల్లగఁ దండ్రినిగుఱుతించి ఆతనియెడఁ గొంతయనురాగముఁ జూపఁగలిగెను. వెనుకటిసంగతు లొక్కటొక్కటే యతనిమనోవీథినంతఁ గన్పట్టెను. అపుడతఁడు జనకునియొడిలోఁదలపెట్టి కనులు మూయును. కాని, బాల్యచాపల్యమున వెంటనే లేచి, తల్లికొఱకై యార్చును!

పుత్త్రికునిమీఁదిమోహముచేత పులి దాట్లువైచుచు వానియొద్దకు వచ్చుచుండియు, తన తనయునియొద్ద నరుఁడుండుట చూచి, వానిసమీపింప సంకోచించెను. కాని, బాలకుని యఱపు వినునపుడు, వానినిరక్షించుట కుద్యమించుచుండును. నోరుతెఱచి, తనవదనగహ్వరమును జూపుచు, ఆపురుషుని జడిపించి కబళింప నుంకించుచుండును. పరహస్తములు తనముద్దులపట్టి దేహమును హత్తుట కోర్వక, తల్లికుక్కవలె పులి గొంతెత్తియేడ్చును. పులి యాతురత పరికించి, పిల్లవానినది నోటఁ గఱచిపెట్టుకొని పోఁగలదని సింహాద్రి వాని నక్కున నదిమిపట్టియుంచెను. వ్యాఘ్ర మంత కోపావేశముతో బొబ్బరించి, యొక్కసారిగ దుమికి, సింహాద్రిబుజముమీఁది కండను తన దంతములతోఁ గొఱికి, వానికాళ్లను గోళ్లతోఁ జీరెను. సింహాద్రి ధైర్యమున దుడ్డుగఱ్ఱతోఁ బులినిగొట్టి, పెద్దఱాతితో దానిశిరమును మోదెను. కాని, వెంటనే తనగాయముల బాధచేతను, పోరాటమువలని యలసటచేతను, అతఁడు సొమ్మసిలిపోయెను. ఆకారణముచేతనే వ్యాఘ్రమును నేలఁబడియుండెను.

ఎంతకాల మానరవ్యాఘ్రములు రణరంగమున నుక్కుదక్కి స్మృతివీడిపడియుండెనో మనకుఁదెలియదు. సింహాద్రికానొక యుద్యానవనమున మలయమారుతము ననుభవించుచున్నానని కలగనిమేలుకొనఁగా.

కమండలువునుండి నీరు తనమీఁదఁ జల్లుచు, తన నాసికకుఁ బరిమళద్రవ్యముఁ జూపించుచుండు తపస్వి యొకఁడు వానిముందట గానవచ్చెను. ఈయన పూర్వపరిచితుఁడగు జడదారియని గ్రహించి, వానికి మ్రొక్కి, వెంటనే తవపరిస్థితులు స్ఫురణకు వచ్చుటచేత, తనయునికొఱకై యిటు నటుచూచెను. దూరమునఁబడియున్న పులి, గాయములబాధచే గోండ్రించుచును, ఇంచుక స్మృతి వచ్చినపుడు మాంసపుముక్కలను గొమరుని నోటి కందించుచునుండెను. దానిపొదుగుమీఁదఁబడి బాలకుఁడు పాలు ద్రావి, సుఖనిద్రఁ జెందియుండెను.

## సింహాద్రి కుమారు నిలుసేర్చుట

ఇపుడు తెలివి బాగుగ వచ్చికూర్చుండిన సింహాద్రి సన్న్యాసితో సంభాషించెను. కొంతకాలముక్రిందట సింహాద్రిభార్య మృతినొందిన సమయముననే తన పిల్లనుగోలుపోయిన యాయాఁడుపులి బిడ్డమీఁది మోహముచే మతిచెడి, వనమువిడిచి, గ్రామములు తిరుగఁజొచ్చెను. ఇట్లు తిరుగుచు పులి సింహాద్రిగ్రామమున నొకరాత్రి వచ్చి, యచట బాలకుని రోదనధ్వనిని విని, పుత్రమోహముచే జాతివైరమును బాటింపక, ఆబాలకుని నోటఁ గఱచిపట్టి, వానిని తన యునికిపట్టునకుఁ గొనిపోయెను. వానికచట స్తన్యమిచ్చి పెంచి వ్యాఘ్రము కొంతదుఃఖోపశమనము నొందెనని చెప్పి, జడదారి యిట్లు పలికెను. "కన్నతల్లిగుణములవలెనే పెంపుడుతల్లి స్వభావమును పిల్లలకుఁ బట్టువడును. నీపాపఁడు నరజన్మమెత్తియును, పులిపెనుపువలన రానురాను మృగరూపమును దాల్చుచున్నాఁడు. పింహాద్రీ! ఇంక నీవుపేక్షించితివేని, బాలకుని మానవప్రకృతికి మరల్చుట దుస్సాధ్యము. వానిమీఁద నాసగలదేని, వ్యాఘ్రమునంత మొందించి, యింటికిఁ గొనిపొమ్ము!"

తన కుమారునింటికిఁ దీసికొనిపోవుటకు సింహాద్రి నిశ్చయించుకొన్నను, తల్లిలేనిపాప కిన్నాళ్లును బాలిచ్చి పెంచిన పులిని కృతజ్ఞతలేక చెండాడి, రెండవసారి వానికి మాతృవియోగ దుఃఖముఁ జేతులారఁ దెచ్చిపెట్టుట కతఁ డొడఁబడకుండెను. "పోనిండు, కన్నవారుగాకున్న పెంచినతల్లియైన నీపాపనిజూచి సంతోషింపనిండు; పల్లెలుగాకున్న వనములు పట్టుకొనియైన నీపట్టి బ్రదికిన నాకుఁ జాలును. అంతియే కాని, పులిని జంపి పుత్రుని గొనిపోవనొల్ల" నని సింహాద్రి చెప్పివేసెను.

అంత నా తాపసుఁ డిట్లు పలికెను. "సింహాద్రీ! నీదయార్ద్రహృదయమునకు మెచ్చితిని. నీకును నీకుమారునికిని మంచిదినములు గలుగనున్నవి. నీవు పులిని జంప నక్కఱలేదు. పులికి నే మత్తుమందిచ్చితిని. దానికి స్మృతిగలుగకమున్నె నీవు పిల్లవానిని గొనిపోయి, అడవులు దాటుము."

ఇట్లుచేసి సింహాద్రి యిలుచేరెనని మొదటి దండకవిలెలో నున్నది. కాని, రెండవధానినిబట్టి, సింహాద్రి యెంతసేపు నడచినను అడవిదాట నేరకుండెను. ప్రొద్దుగ్రుంకుటచేత, ఒకకొలనిలోనినీరు కుఱ్ఱనికిఁ ద్రావనిచ్చి, వానిని దనయుత్తరీయముమీఁదఁ బండుకొనఁబెట్టి కాచుచుండెను. మిక్కిలియలసియుండుటచేత సింహాద్రికనులకుఁ గూర్కువచ్చెను. ఐననొకింతసేపటికి కదరిపడి తెలివితెచ్చుకొని చూడఁగా, బాలకుని చుట్టును పెద్దసర్పమొకటి చుట్టచుట్టుకొని, వానిశిరసుమీఁదికిఁబడగెత్తి, అస్తమయభానుని కిరణములు వానిముఖకమలమును సోకనీయకుండఁ గాపాడుచున్నటులుండెను! సింహాద్రి యేమిచేయుటకును దోఁచక నిశ్చేష్టుఁడై తేఱిచూచుచుండఁగా, దూరముననొక మనుజుని యడుగుల చప్పుడు కానికి వినఁబడెను. సర్పముకూడనది గనిపెట్టి, పిల్లవానిశిరము ముమ్మాఱుమూర్కొని, పొంతనుండు పొదలోనికి వెడలిపోయెను.

ఇట్లు వారలఁ జేరవచ్చినది వెనుకటిజడదారియె. సమయమునకు వచ్చి, తనయుని సర్పదంష్ట్రిలనుండి తప్పించినందుకై సింహాద్రి వానికిఁ బ్రణమిల్లెను. అంత సన్న్యాసి, "సింహాద్రీ! నీకుమారుఁడు చిరంజీవి యగును. అతఁడు పుడమిఱేఁడై, వంశోద్ధారకుఁడై, కడుకీర్తింగాంచఁ గలఁడు. వేగమె యిలుసేరి, నీబాలకుని రక్షించుకొమ్ము!" అనిపలికి, తన దారిని దానుబోయెను.

సింహాద్రి శీఘ్రముగనె యిల్లుచేరెను. వారినిజూచి బంధుమిత్రాదులత్యాశ్చర్యము నందిరి. కాని సింహాద్రి మనసుమాత్రము చిరకాలము శాంతి ననుభవింపలేదు. తండ్రి తన్ను పులిపొదుగునుండి విడిపించి తీసికొని వచ్చినపుడె యాబాలకుఁ డెంతో విలపించెను. పులిపాలు గ్రోలి పచ్చిమాంసము తినుట కలవాటుపడిన యాపాపనినోటి కన్యాహారమేమియు రుచింపదయ్యెను. వ్యాఘ్రసహవాసమునకు మఱిగిన వానికన్నులకు మానవశరీరములు వికృతాకారములుగఁ దోఁచెను. అడవిలో హాయిగఁ దిరుగాడుట కభ్యాసపడిన వానికాలుసేతులకు, జనకుని మందిరము కారాగృహ సదృశమయ్యెను. పులితల్లి తలంపునకు వచ్చినప్పుడెల్ల నాబుడుతఁడు పులిపిల్లకంఠముతో బొబ్బరించుచు, రోదనము చేయుచుండెను.

## వ్యాఘ్రమాత పుత్రమోహము

ఒకనాఁడురాత్రి నీలాద్రి తల్లిదెసకు ధ్యానము వాఱి విలపించుచుండెను. మాతృవియోగమునొందిన శిశువునకు స్త్రీలోకమంతటిలో వేఱొకమాత సమకూరదందురు. అట్టిచో, పులి తల్లికి మాఱుతల్లి తనయునికెట్లు చిక్కునాయని సింహాద్రి విచారించుచుండెను. బాలకుని విపినమునుండి తప్పించి కాచితినని వాని కెంతమాత్రమును సంతోషము లేదు. తానరణ్యమునఁ జూచినప్పటికంటె బాలకుఁ డిపుడు కొంతమానిసివాలకము దాల్చుచున్నను, వానిరుచులు వాంఛలు నింకను వనములమీఁదికే పోవుచుండును. ఇంటినుండి తప్పించుకొనిపాఱిపోవుదమనియే నీలాద్రి పెనఁగులాడుచుండును. వాని నింటనెపుడు నినుపగొలుసులతోఁగట్టి యుంచవలసినదే! త్రిశంకుస్వర్గమునుబోలిన యిట్టిస్థితికంటె, బాలకునికి వెనుకటిదశయే మేలని సింహాద్రి తలంపఁజొచ్చెను.

సింహాద్రికానాఁ డొక వింతసంగతి పొడగట్టెను. అటవనమున బాలకుని పెంచినపులి, తనకుస్మృతివచ్చినతోడనే, కుఱ్ఱనిసంగతి జ్ఞప్తికి వచ్చి, వానిని సింహాద్రి గొనిపోయినదారినే పసిపట్టినడువసాగెను. ఎట్ట

శేల కది వారు నివసించు గ్రామము చేరి, రాత్రిసమయమున విరామము లేక విలపించు బాలకుడు తనవాడని గ్రహించి, తలుపులు బ్రద్దలు చేసి వచ్చి యాయింటం బ్రవేశించెను. ఇంటవారందఱును భయపడి నలుదెసలకును బరువులిడిపోయిరి. కాని సింహాద్రిమాత్రము నిర్భయముగ బాలకుడు పవళించిన మంచముదగ్గఱకుం బోయి నిలచెను. వ్యాఘ్రము సింహాద్రిని బసిపట్టి, వాని సంగతి యిదివఱకు గ్రహించినది గావున వానితోం గయ్యమునకుం గాలుద్రవ్వక, తోకం ముడిచి, గొణుగుకొనుచు గదివాకిల గద్దెవేసికొనియుండెను. సింహాద్రి పులి దెసకుంబోక, తన యుని ముద్దాడి, వానినోటికి రుచ్యములగు ఫలములు పెట్టి, వానిరోదనమునకుం గొంతయుపశమనము గలిగించెను.

నరవ్యాఘ్రము లిరువురును బాలునికి సన్నబంధువులనియు, వాని పురోవృద్ధి సమానముగం గోరి లంబేసి యొండొరులతోం బోరాడుట తగదనియు నిపుడు గ్రహించుచున్నట్లు గానంబడెను. కాని, పిల్లవాని నడవులలోనికిం గొనిపోయెదనని పులియు, గ్రామమున నుంచెదనని మానిసితండ్రియు, వారివారి స్వభావముల ననుసరించి కోరుచుండిరి. ఈ తీవసమస్యను దేల్చుటకే పూర్వపరిచితుడగు సన్న్యాసి యిపు డచటికివచ్చెను. అతనియాజ్ఞానుసారముగ నంత విశాలమగు వారిదొడ్డిగోడ, బాలకునితోం బులిదుమికిపోవుటకు వలనుగాకుండునట్లు, మిక్కిలి యెత్తుగం గట్టంబడెను. దీనికంటియుండు పెద్దగదియే నీలాద్రి యాన గృహము. తనయిచ్ఛవచ్చినట్లు పెరటిలో సంచారముచేసి పులి తకునిమీద భ్రమవాలినపుడు పులి గదిసమ్మెను దగ్గఱకు వచ్చును. తనయంత దంత తల్లినిజేరి, కడుపార తీయనిపాలు ద్రావి, లోనికింజని జనకునితో సరస సల్లాపములాడి, ప్రొద్దుపుచ్చుచుండును!.

## నీలాద్రిరాజు

ఇట్లు చిన్ననాడె తల్లినిగోలుపోయియు, తల్లిప్రేమను దిరిగి చవిచూచిపెరిగి, నీలాద్రి యాకాలపుబాలురలో మిగులబలిష్ఠుండయ్యెను. అతం డన్నివిద్యలు నేర్చెను. అన్నిసుగుణములు వానికిం బట్టుపడెను. ఇట్టితఱి వానియదృష్టమునంజేసి యొకసంగతి తటస్థించెను. ఆదేశమును బాలించు భానుప్రతాపుం డను ప్రభువునకుం బుత్త్రులు లేకుండిరి. ఆయనకుం ద్రిపురసుందరి యను పుత్త్రిక యొకతెమాత్రము గలదు. తనకు వార్ధకదశ సమీపించుటంగాంచి భానుప్రతాపుండు, చుట్టుపట్టుల నున్న బలిష్ఠులగురాజులు ముందు తనకొమరితకు రాజ్యము దక్కనీయకుందురను భయమునొంది, వారినందఱ దనయాజ్ఞలో నుంపంగల పరాక్రమవంతుని కొకనికిం దనకూతును, రాజ్యమును నొసంగదలచుకొనని యుద్యమించెను. సింహశార్దూలములను జయింపంగల వీరునికిం దన కూతును రాజ్యము నిచ్చెదనని ప్రతాపమహారాజు ప్రకటించెను. త్రిపురసుందరి కింతటితోం దనివితీరక, పులివాహనముగాంగల యరద మెక్కి రాంగల శూరునే తా వరింతునని ప్రతిజ్ఞంబూనెను.

ఇట్టి కఠినశోధనలకులోనై, రానున్న రాజ్యపదవియందలి వాంఛ నసువులమీందుగం గోలుపోవుటకు సంసిద్ధులగు వేలలంతగం గానరాకుండిరి. అప్పుడు నీలాద్రి తానీ స్వయంవరమునకుంబోయి చూచెదనుగాక యని తలపోసి, ప్రతాపుని నగరు చొచ్చి, పురజనులు ప్రేక్షకులవలె చూచుచుండంగా రంగము ప్రవేశించెను. వ్యాఘ్రముగల బోను తలుపుతీసిరి. సడివియున్నన నుండు పులి వానిమీందికి జెంగలించెను. పులిచేం బెనుపంబడి చిన్ననాంటనుండియు పులి జిత్తులు గ్రహించి పులిబలముగల యాబలశాలి పులివలె కూసి, తనను గదియ వచ్చు పులికుత్తుకను బట్టి దానిని గ్రిందికిం బడవైచెను. తలతిరిగి పులి, తన క్రౌర్యమును దిగ్గించి, తోంక ముడుచుకొని, వెనుకకొదిగి యుండెను. సామాజికులందఱును దీని కాశ్చర్యమందిరి. ఈసులభవిజయముతోం దనివిం జెందక, తనవనసు దీనస్థగ నింకను వ్యాఘ్రముతోం బోరుటకు నీలాద్రి దాని నన్నిపర్యాయములు చెనకెను, వ్యాఘ్రము నోరుతెఱచి, 'కుయ్యో' యనుచు, వెనుకకుంబోవుచు, తుదకు బోనులోని కట్టె పరుగిడిపోయెను.

నీలాద్రి వ్యాఘ్రమును జయించెనని రాజు నిర్ధారించెను. కాని రాచకొమరిత నియమము ననుసరించి యాతండింకను తన పౌరుషమును జూపింపవలసివచ్చెను. స్వాభావికముగ నెంతటి బలిష్ఠమృగమైనను, వ్యాఘ్రము తనస్వభావము గురుతెఱింగ తనతో డీకొనిన నేర్పరియగు బలశాలి భుజబలము నొకపరి చవిగొనినచో వానితోడి సమరమున కింక సన్నాహపడకుండెడి సహజభీరువు. ఈ సంగతిగ్రహించిన నీలాద్రి అడవిలోనికింజని యందలి వ్యాఘ్రజాలము నుపాయముతో జయించి, వానిని మచ్చికపఱచి, వానిని బూన్చినరథమెక్కి, రాజకుమారిని జెట్టవట్టి, సింహాసనము నధిష్ఠించెను.

నీలాద్రి ప్రభుత్వమున జనులు సకలైశ్వర్యముల ననుభవించిరి. కన్నబిడ్డలవలె ప్రజల నీయన కాపాడెను. తన్ను పుట్టించి మితిలేని కష్టములపాలై, మృగదశనుండి తప్పించి తన్ను స్వదశకుం గొనివచ్చిన జనకుని పేరిట నీతండెన్నియో దానధర్మములుచేసెను. తన్నుం దల్లివలెం బెంచిన వ్యాఘ్రము జీవించినంతకాలమును దాని నెంతో ప్రేమతోం గాపాడి, యది చనిపోయినపు డధికముగ విచారమునొంది, ఒకవత్సరమువఱకును కఠిననిష్ఠానియమము లూనియుండెను. తనప్రభుత్వమునం జెల్లునాణెములమీంద దన యిరువురుతల్లుల ప్రతిమలను ముద్రింపించెను. తనరాజధానికి "వ్యాఘ్రపురము[2]" నావమిడి తన యపారమాతృప్రేమను బ్రకటీకృతముచేసెను. తనవ్యాఘ్రమాతమీంద నింకను మమకారముదీఱక, నీలాద్రి, తాను "పులికూన" యను గౌరవనామమును స్వీకరించి,

---

1. ఇట్లు చెనకుటకు సిద్ధమగుపులి, పసిపట్టి, నీలాద్రి, వ్యాఘ్రవంశజుం డగు స్వజాతీయుం డని గ్రహించి, వానితో యుద్ధముచేయకుండెనని రెండవ దండకవిలెలో నున్నది.

2. ఈవ్యాఘ్రపురము రాజధానిగాం గల దేశమునే వ్యాఘ్రదేశమని జనులు వ్యవహరించుచువచ్చిరి. కానుకాను, ఇదియే "వేగి" దేశమయ్యెను.

తన్ను పులి యడవులకుఁ గొనిపోయినదినమునఁ దనదేశపుప్రజలు పులి పండుగను పేరితో నుత్సవము జరుపునట్లుగ శాసించెను. ఈపులిపండుగ లు, ఈరాజుకాలమున నేకాక, తరువాతనుగూడ, జరుగుచువచ్చెను. వేఁట రాజధర్మమైనను, తనమాతృవంశజములగు వ్యాఘ్రములవంకకు నీలాద్రిరాజు పోకుండెను. ఒకటేమి,ఆవంశము వారికందఱికి వ్యాఘ్రము కులదేవతయయ్యెను. వారెపుడును పులిరక్తమును జూడనొల్లరు. ఎచటనైనను పులులబాధ యధికమయ్యెనేని, ఒంటరిగ రాజా ప్రదేశమునకుఁ బోవును. నీలాద్రివంశజులు పులియంశమున నవతరించి యుండువారు గావున వారిని బసివట్టి, మిత్రులగు వారిదేశమునుండి పులులంత వెడలి దూరపుటడవులకు వలసపోవును. *

---

# కలివిడంబనము

మల్లాది సూర్యనారాయణశాస్త్రి గారు

[క్రోధన సంవత్సరాదిసంచిక తరువాయి]

క. చారులను విచారించియె
భూరమణులజన్మఫలముఁ బొందుగజోస్యం
దారూఢిఁ జెప్పఁదగు, గ్రహ
చారపరిజ్ఞాన మతని సమయంబగుటన్.

గీ. రెండువిధముల ఫలము చర్చింపవలయు
ఫలమునకు రెండుకాలముల్ తెలుపవలయు
రోగములు కష్టములు రాజయోగములును
గలిపిచెప్పంగ వలయును గాలవేత్త.

గీ. చెప్పినట్లుగు నూటి నార్జించువాఁడు
కాలవేత్తకు నిచ్చుఁ దాంబూలమొకటి
వేయియార్జించువాఁ డింత వేయుఁదిండి
ఫలము తప్పినవాఁడు నిచ్చలును దిట్టు.

గీ. స్వప్నఫలములు చెప్పెడివాఁడు శకున
ఫలము వచియించువాఁడు నుపాసకుండు
ననెడిమువ్వురు జ్యోతిషికునకు ధాత
జగతి నిర్మించినట్టి నిసర్గరిపులు.

గీ. రోగములు పూర్తిగాఁ జెలరేఁగుచుండ
రోగు లంతకపురమున కేగుచుండ
రోగతత్త్వంబు లౌషధయోగగతులు
నల్లనల్లఁ జికిత్సకు లరయుచుంద్రు.

క. రోగనిదానంబును మఱి
రోగముపే రిచ్చుమందు రోగస్థితియున్
రోగికడ స్త్రీలవలనన్
రోగచికిత్సకుఁడు ముందెఱుంగును జుమ్మీ!

గీ. తీపిమాటలు చెప్పెడితెల్వి, మందు
లిచ్చునేర్పును, జోస్యంబునెఱుక, మాంత్రి
కత్వ మొక్కొక్కటే డబ్బు గడనచేయు
రెండుమూఁ డిందు నొక్కచో నుండు టరిది.

గీ. కల్లలాడుట ప్రియవాద కౌశలంబు
ననెడిరెండును ధనయోగ మొనరఁజేయు
సత్యమాడుట మహిత పాండిత్యశక్తి
కలిసి దారిద్ర్యయోగంబుఁ గలుగఁజేయు.

గీ. కవితయొక్కటియే తనగతిని బట్టి
గ్రామ మార్జించు లేక వారణముఁ దెచ్చు
కాశ గుఱ్ఱంబును గడించు లేక తుదకు
భోజనం బంబరంబు తాంబూలమేని.

---

* ఈదండకవిలెలలో నింక నిట్టి విశేషములేయున్నవి. నీలాద్రియు, వానివంశజులును వ్యాఘ్రమంత్రములు జపియించి, పులులబాధనుండి ప్రజలను రక్షించుచువచ్చిరట. అంతియెకాని, చరిత్రాంశములుమాత్ర మీకవిలలో నంతగఁ గానరావు. నీలాద్రి జన్మస్థలములకు "కూనపులి" యను పేరుగలిగెను. ఈగ్రామపుజాడ లిపుడు గానరాకున్నను, ఆప్రాంతమున నేను విచారణచేయఁగా కూనపులివారు, బ్రాహ్మణులలోను తక్కి నకులజులలోను పెక్కండ్రు గానవచ్చిరి. పులికొనవారు, పులిపాకవారును, ఆంధ్రదేశమున ననేకప్రదేశములలోఁ గలరు. వీనియన్నిటినిబట్టి యాలోచింపఁగా, "పులికూన"నుగురించిన పైయైతిహ్యములోఁ జాలవఱకు సత్యముండవచ్చునని తోఁచెడిని.

పైనుదాహరించిన దండకవిలెలు నాయొద్దనున్నవి. సవరణచేయక, యథాక్షరముగనే వానిని బ్రమరింపఁగూడదాయని కొందఱుమిత్రు లనిరి కాని, అటుచేసినచో, గ్రామ్యభాషావాదులకు మఱింతపురియెక్కునని నే నట్లుచేయ సాహసింపనైతిని.